క్లుప్తంగా

పెదపోలి తల్లి ఆలయ ప్రారంభోత్సవం



హోమగుండానికి నమస్కరిస్తున్న భక్తులు

తెర్లాం: మండలంలోని సుందరాడలో పెదపోలి తల్లి ఆలయ ప్రారంభోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగానే ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గాడి కృష్ణ, వెంకటమ్మలతో పాటు గ్రామపెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పెన్షన్ అందజేత



విశాఖలోని చిన్నారావుకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

మెంటాడ: మండల కేంద్రానికి చెందిన పాండ్రంకి చిన్నారావు కాలికి ఇటీవల శస్త్రచికిత్స చేయడంతో విశాఖలోని తన కుమారుడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ప్రతి నెలా పెన్షన్ల పంపిణీలో భాగంగా స్థానిక వలంటీర్ బొద్దల రామునాయుడు గురువారం విశాఖకు వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో వలంటీర్‌ను పలువురు అభినందించారు.

రోగులకు వైద్య పరీక్షలు



ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెర్లాం: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పణుకువలసలో గురువారం వైద్యశిబిరం నిర్వహించి రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి మాట్లాడుతూ, రోగులకు సొంత గ్రామంలోనే వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. సర్పంచ్ చందక సత్యనారాయణ మాట్లాడుతూ, రోగులు వైద్యసేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళి, వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎస్ఎం, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణా నేరం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ సీఐ జైభీమ్, తదితరులు

బొబ్బిలి: గంజాయి, సారా వంటి మాదకద్రవ్యాల రవాణా నేరమని ఎస్ఈబీ సీఐ ఆర్. జైభీమ్ అన్నారు. పట్టణ పరిసరాల్లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. బస్సులు, ఆటోలు, కార్లను తనిఖీ చేసి ప్రజలు, ప్రయాణికులను చైతన్యపరిచారు. నిషేధిత వస్తువుల రవాణా చేస్తే కలిగే నష్టాలను వివరించారు.

ఈ నెల 10 నుంచి ఇంటింట ధర్మప్రచారం



సమావేశంలో పాల్గొన్న ప్రచారక్‌లు

బొబ్బిలి: సమరసతా ఫౌండేషన్ ద్వారా ఈనెల 10 నుంచి చేపట్టనున్న ఇంటింట ధర్మప్రచారంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆ సంస్థ రాష్ట్ర ధర్మప్రచారక్ ముద్దు సాయిరాం అన్నారు. పట్టణంలోని సింగారపు వీధి వైభవ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో డివిజన్ స్థాయి ప్రచారక్‌ల సమావేశం గురువారం నిర్వహించారు. డివిజన్ ధర్మప్రచారక్ ధూపం వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉపాధ్యాయ కన్వీనర్ కొల్లూరు జగన్నాథం, డివిజన్ కన్వీనర్ కల్యాణస్వామి, బొబ్బిలి, బాడంగి, బలిజిపేట మండలాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ మందిర ప్రారంభోత్సవం

బాడంగి: మండలంలోని రేజేరులో నూతనంగా నిర్మించిన రామాలయ మందిర ప్రారంభోత్సవం గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. మొదటి రోజు పందిర్రాట వేసి ప్రత్యేక అంకురార్పణ పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో ప్రతిఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణంలోని కూరాకుల, తాణా, నెయ్యిల, సాయిబుల వీధులతో పాటు శ్రీనివాసనగర్, చిన్నచెరువు గట్టు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. దీంతో జై జగనన్న.. జై జోగులన్న అని వారు నినాదాలు చేస్తూ ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ నీరు–చెట్టు పథకం పేరిట కొన్ని రూ.కోట్ల ప్రజాధనం దోచుకుందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇప్పటివరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా అప్పటి టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గర చేయాల ఉద్దేశ్యంతోనే గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ, ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు చేరవేయాలన్న లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వ తీసుకువచ్చిందని వివరించారు. సచివాలయంలో పథకం కోసం దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే ఇప్పుడు మంజూరవుతోందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని జీర్ణించుకోలేకే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా జగనన్న సర్కారుపై లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కలమట శంకర్, నల్లా శ్రీనివాసరావు, దూబ గోపాలం, వంజరాపు విజయ్ కుమార్, కోరాడ రామినాయుడు, తోట తిరుమల రావు, యందవ చినబాబు, మిర్తిరెడ్డి నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈ రత్నాకర్, టీపీఓ నాగలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజాం, సంతకవిటి మండలాల్లోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలుగా ఎంపికైన వారికి ఎమ్మెల్యే కంబాల జోగులు గురువారం నియామకపత్రాలు అందజేశారు. రాజాం మండలం, సీతంపేట–ఎ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తగా వి.అనూష, గెడ్డవలస అంగన్‌వాడీ కేంద్రం ఆయాగా చౌడియమ్మ, సంతకవిటి మండలం, గుజ్జన్నపేట అంగన్‌వాడీ కేంద్రం ఆయాగా బొడ్డేపల్లి చిన్నమ్మడు ఎంపికైన వారిలో ఉన్నారని ఐసీడీఎస్ పీఓ టి.కనకదుర్గా తెలిపారు. కార్యక్రమంలో రాజాం ఎంపీపీ లావేటి సులోచన, వైఎస్సార్ సీపీ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, చిత్తారిపురం సర్పంచ్ మొయ్యి మోహన్, ఏసీడీపీఓ సిమ్మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న విద్యాకానుక కిట్లు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న జగనన్న విద్యాకానుక కిట్లు మండలానికి గురువారం చేరుకున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌కు చేరుకున్న సరుకులను ఎంఈఓ త్రినాథరావు, పాఠశాల హెచ్ఎం పాపారావు, క్వాలిటీ కంట్రోల్ అధికారులైన ఎస్ఎస్ఏ ఏఈ నర్సుపల్లి రవికుమార్, వెలుగు ఏపీఎం టి.రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, పాఠశాలల పునఃప్రారంభమైన తర్వాత ఆయా పాఠశాలలకు కిట్లు పంపిస్తామన్నారు.

బిందు సేద్యంతో మెరుగైన లాభాలు



అరటితోటను పరిశీలిస్తున్న పీడీ, తదితరులు

మెంటాడ: బిందు, తుంపర సేద్యం చేయడం వల్ల మెరుగైన లాభాలు ఆర్జించవచ్చని మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి పి. లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కొండలింగాలవలసలో గురువారం పర్యటించి అరటిపంటలో బిందు, తుంపర సేద్యం చేసే పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బిందు, తుంపర సేద్యానికి అవసరమయ్యే పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ఉద్యానవనశాఖాధికారి రాజశేఖర్, ఏపీఎంసీ ఇంజినీర్ ఎం.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

బాడంగి: ఏపీ పౌర గ్రంథాలయ శాఖా ఆదేశాలతో స్థానిక ప్రభుత్వశాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఆర్. దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీ నుంచి వచ్చే నెల జూన్ 11 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండు పూటలా పనిచేస్తే రూ.250



రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు



రాజాం సిటీ: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండు పూటలా పని చేస్తే రోజుకు రూ.250లకు పైగా వేతనం వస్తుందని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, వన్నలి, చాటాయివలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులు గురువారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో సౌకర్యాలపై వేతనదారుల వద్ద ఆరా తీశారు. గరిష్ట వేతనం పొందేందుకు ఏవిధంగా పనిచేయాలో వారికి వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రాజాం సిటీ: ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. రామానుజులపేట గ్రామంలోని పెద పూను చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనులు చేయాలని, ఇచ్చిన కొలతలను పూర్తి చేస్తే గరిష్టంగా రూ.272లు వేతనం వస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఎఫ్ఏలకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ కె.సాయిరాం ఉన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి..

బాడంగి: జగనన్న భూసర్వే – శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ రీసర్వే పూర్తయిన గ్రామాలలో సర్వేరాళ్ల ఏర్పాటు లక్ష్యాన్ని చేరుకోవాలని డీఐఎస్ నారాయణరావు కోరారు. మండలంలోని జీకేఆర్ పురం, రామచంద్రాపురం, గజరాయునివలస గ్రామాలలో గురువారం సర్వేరాళ్ల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాలమురళీకృష్ణతో కలిసి మాట్లాడుతూ, మండలంలోని 29 రెవెన్యూ గ్రామాలకు గాను తొలివిడతగా 21 గ్రామాలలో రీసర్వే పనులు పూర్తయినందున ఆ గ్రామాలలో సరిహద్దులను పోలుస్తూ సర్వేరాళ్లు పాతుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ల బృందం, వీఆర్ఓలు దేవి, రామకృష్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులకు క్రాస్‌ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా బోర్లు పాడైనట్లయితే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సమాచారం అందించినట్లయితే వారు వచ్చి బోర్లు బాగు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.ఐజాక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

6లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

రాజాం సిటీ: ప్రభుత్వ పింఛన్‌దారులు ఈ నెల 6లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సబ్‌ట్రెజరీ అధికారి జోగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం సబ్‌ట్రెజరీ పరిధిలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నుంచి ఇంత వరకు 400 మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని అన్నారు. మిగిలిన వారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడండి



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సూచించారు. సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోఓల్టేజీ గ్రామాల వివరాలు సేకరించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. పాడైన స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఈ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

సంతకవిటి: మండలంలో అప్పలఅగ్రహారం గ్రామంలో పాడైన తాగునీటి బోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టారు. క్రాస్‌ప్రోగ్రాం కింద గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగుచేస్తున్నట్లు జేఈ సంతోష్‌కుమార్ తెలిపారు. మెకానిక్‌లు త్రినాథరావు, మన్మథరావు, సూర్యనారాయణ తదితరులు బోరు మరమ్మతులు చేపట్టారు.

అంకితభావంతో పనిచేయాలి

రేగిడి: సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. మండలంలోని పెద్దశిర్లాం, అంబాడ, చిన్నశిర్లాం, ఉనుకూరు గ్రామ సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. ఉద్యోగులు, వలంటీర్ల సేవలపై ఆరా తీశారు. ప్రజలకు సకాలంలో సేవలందించాలని, అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలువ పనుల్లో నాణ్యత పాటించాలి

వంగర: మడ్డువలస ఎడమ కాలువ పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మగ్గూరు వద్ద చేపడుతున్న మడ్డువలస ఎడమ కాలువ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సాగునీటి సరఫరాలో ఎటువంటి ఆటంకం కలగకుండా పనులు నాణ్యతతో చేపట్టాలని వేతనదారులకు సూచించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



తాడ్డి సాయికృష్ణ

రాజాం సిటీ: మండల పరిధిలోని నందబలగ పంచాయతీ, లక్ష్మీపురం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి తాడ్డి సాయికృష్ణ అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన కోచింగ్ వెళ్తానని చెప్పి, ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఇంతవరకు ఇంటికి చేరలేదని దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. తెలిసిన వారిళ్లతో పాటు బంధువుల ఇళ్లల్లోనైనా ఉన్నాడా అని ఆరా తీసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగనన్న అందరివాడు..

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: గడిచిన నాలుగేళ్లుగా కుల,మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందరివాడని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని జక్కువలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికీ ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకం అందుతోందన్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని చెప్పారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజా ధనాన్ని దోచుకుతున్నారని ఆరోపించారు. అందరి మేలు కోరే జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చిరెడ్డి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సంధ్య, ఎంపీపీ ఆర్.ఎస్.నాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.ఈ.రావు, నాయకులు ఎల్.ఆర్.నాయుడు, సిరిపురపు నాగమణి, లచ్చిరెడ్డి అప్పలనాయుడు, రెడ్డి అప్పారావు, కుపిరెడ్డి మోహన్, కిలపర్తి మధు, కర్రి అప్పలస్వామి, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులతోనే అధికారిక శంకుస్థాపన

- భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

బొబ్బిలి: టీడీపీ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేశామని మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు ప్రగల్భాలు పలుకుతున్నారని, ఏ అనుమతులూ రాలేదని తెలిసే ఆనాటి మీ విమానయాన శాఖా మంత్రి అశోక్ గజపతిరాజు ఆ బూటకపు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కాలేదన్న విషయం అందరికీ తెలిసిందేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయి పాతేసినంత మాత్రాన శంకుస్థాపన అయిపోదని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చాకే నిర్వాసితులకు పరిహారాలు, ఇళ్ల స్థలాలు, ఇతర సౌకర్యాలు కల్పించామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ బాధ్యతలు చేపట్టాకే కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి అనుమతులు ఇచ్చిందన్నారు. ఇవేమీ తెలియని మాజీ మంత్రి బొబ్బిలిలో వారు వేసిన రాళ్లలాగే అనుకుని మాట్లాడటం సరికాదని విమర్శించారు.

అవసరమైన మేరకే భూమి

గత ప్రభుత్వంలా చేసినవే మళ్లీ మళ్లీ చేయడం తమ పార్టీకి గానీ, తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానీ లేవన్నారు. అప్పట్లో టీడీపీ హయాంలో అనుకున్నంత భూమి కాకుండా కేవలం విమానాశ్రయానికి అవసరమైనంత మేరకే తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం పరిహారాలు చెల్లించిందని చెప్పారు. సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరు పెట్టుకున్న తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టును కేవలం అశోక్ గజపతిరాజే అడ్డుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 24వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీటితో పాటు ఎయిర్‌పోర్టుకు అవసరమైన నీటిని ఇచ్చే విధంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. టీడీపీ అసంబద్ధ ఆరోపణలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వేదికపై నుంచే స్పష్టత ఇచ్చారన్నారు. బొబ్బిలిలో కూడా రాజులు వేసిన శంకుస్థాపన రాళ్లు సమాధి రాళ్లలానే ఉన్నాయి తప్ప ఏవీ పనులకు నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఏపీపీ మజ్జి జగన్నాథం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవత పండుగలు జరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులంతా కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. వేసవి ఎండల దృష్ట్యా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే పశువులకు తాగునీరు అందించేందుకు నీటితొట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి సచివాలయంలో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.

వేతనదారులందరికీ ఉపాధి



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, పక్కన వైస్ ఎంపీపీ సత్యనారాయణ

తెర్లాం: ఉపాధి వేతనదారులందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం పాడి చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎండలు ఎక్కువగా ఉన్నందున వేతనదారులు ఇంటి నుంచి వచ్చినప్పుడు తాగునీరు, మజ్జిగ తెచ్చుకోవాలన్నారు. అలాగే పని ప్రదేశం వద్ద టెంట్లు వేయాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. కొలతల ప్రకారం పనులు చేపడితే రోజుకు 257 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత



రేగిడి: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ప్రసాద్



వంగర: జయరాజ్‌కు పెన్షన్ అందిస్తున్న వలంటీర్



రాజాం సిటీ: రోగికి పెన్షన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి

రేగిడి: తగరపువలసలో డయాలసిస్ చికిత్స తీసుకుంటున్న మండలంలోని పెద్దకోడిశ గ్రామానికి చెందిన యజ్జల దాలయ్యకు వలంటీర్ జామి ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి, మరీ పెన్షన్ అందజేశారు. సదరు వలంటీర్ సేవలను గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

వంగర: విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంగరకు చెందిన అరటికట్ల లిఖితకు వలంటీర్ కారు రామారావు ఆస్పత్రికి వెళ్లి, మరీ పెన్షన్ అందజేశారు. అలాగే కింజంగికి చెందిన కలింగ జయరాజ్ విశాఖపట్నంలో చికిత్స పొందగా, అక్కడికి కూడా వలంటీర్ వెళ్లి పెన్షన్ అందజేశారు. దీంతో ఇరు గ్రామాల ప్రజలు, అధికారులు వలంటీర్ సేవలను అభినందిస్తున్నారు.

రాజాం సిటీ: పెందుర్తిలో చికిత్స పొందుతున్న మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన గుండ సన్యాసికి వలంటీర్ బెండు వెంకటరావు, విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బట్న రాములుకు బొద్దాం వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి గురువారం పెన్షన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మరీ వారు పెన్షన్ అందజేయడం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ధన్వంతరి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ధన్వంతరి లక్ష్మీగణపతి ఆలయంలో ఈ నెల 5న ప్రత్యేక పూజలు చేయనున్నామని అర్చకులు బూరగాం అనంతలింగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 6గంటల నుంచి స్వామివారికి క్షీరాభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.